ప్రజాశక్తి

సోమవారం 23 డిసెంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ధాన్యం కొనుగోలు మందగమనం

- లక్ష్యం నిర్ధారణలోనే మీనమేషాలు
- జిల్లాలో ఉత్పత్తి అంచనా 3.85 లక్షల టన్నులు
- కొనుగోలు లక్ష్యం 20 వేల టన్నులు
- ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 10 వేల టన్నులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలు మందగమనంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు కేవలం 10 వేల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ప్రభుత్వం తొలుత తమకు 10 వేల టన్నుల లక్ష్యం మాత్రమే ఇచ్చిందని అధికారులు చెబుతున్నారు. తాజాగా మరో 10 వేల టన్నుల లక్ష్యంను పెంచింది. జిల్లాలో 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఎకరాకు 35 బస్తాల సగటు దిగుబడి వస్తోంది. ఇప్పటి వరకు 50 శాతం విస్తీర్ణంలో కోతలు పూర్తయ్యాయి. బస్తాకు 76 కిలోల చొప్పున 2.66 టన్నుల ధాన్యం వస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 3.85 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం 20 వేల టన్నులు మాత్రమే లక్ష్యంగా నిర్ధారించారు. అయితే ఇప్పటి వరకు దాదాపు లక్ష టన్నుల ధాన్యం దిగుబడి రైతుల వద్దకు చేరగా కేవలం 10 వేల టన్నులే కొనుగోలు చేశారు. మరో లక్ష టన్నుల ధాన్యం వరకు రైతులు నూర్పిడి చేయకుండా కుప్పలు వేసుకుంటున్నారు. అంతేగాకుండా తేమశాతం సాకుగా చూపి వ్యాపారులు కొనుగోలుకు ముందుకు రావడం లేదు.

కనీస మద్ధతు ధర 75 కిలోల బస్తాకు రూ.1740కు కొనుగోలు చేయాల్సి ఉండగా రూ.1350 నుంచి రూ.1400 మించి కొనేనాథుడు లేరు. తేమశాతం బూచిగా చూపి బస్తాకు రూ.350 వరకు తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. 30 నుంచి 35 బస్తాలు దిగుబడి వస్తే తక్కువ ధరకు విక్రయించడం వల్ల రైతుకు ఎకరాకు రూ.10 వేలు నష్టం వస్తోంది. మిల్లర్ల, అధికారుల మాయాజాలంలో రైతులు సమిధలుగా మిగులుతున్నారు. తేమ శాతం 23 వరకు కొంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించినా 17 శాతం మించి తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదని రైతులు చెబుతున్నారు. కొంత కాలంగా వాతావరణంలో ఎండ రాకపోవడం, ముసురు వాతావరణం నెలకొనడంతో ధాన్యం ఎండబెట్టుకునేందుకు అవకాశం లేకపోవడం వల్ల రైతులు అయిన కాడికి అమ్ముకుంటున్నారు. నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడం వల్ల కల్లాల్లో వ్యాపారులు చెప్పిందే వేదంగా రూ.1400 కంటే తక్కువకే అమ్ముకుంటున్నారు. జిల్లాలో

▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాగొంతుక పిడిఎఫ్‌ను గెలిపించండి

ప్రజాసంఘాల పల్నాడు జిల్లా సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజక వర్గానికి 2025 మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్‌గా తిరిగి తనను గెలిపించాలని కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షకులు, ప్రజలు బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన, పోరాటాలు నిర్వహిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందని పిడిఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం ఎన్జీఓ కాలనీ టైనీ టాట్స్ కిండర్ జాయ్ స్కూల్‌లో ఆదివారం కృష్ణా -గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల కార్యచరణ సమావేశం యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కె.ఎస్ మాట్లాడుతూ ఈ నెల 31 నాటికి పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా విడుదలవు తుందన్నారు. ఉమ్మడి కృష్ణ జిల్లాలో 50 మండలాలు, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 57 మండలాల, మున్సిపాలిటీలు, మెగా కార్పొరేషన్లలో గతంలో 2.50

▶ 2లో

నేలపై వాలిన పొగాకు పైరు

ముంచిన వాన

నీటిలో తేలాడుతున్న వరి పైరు

ప్రజాశక్తి-ఈపూరు: భారీ వర్షం మండలంలోని కొచ్చర్ల, కొండ్రముట్ల, శ్రీనగర్, అంగలూరు,, వనికుంట గ్రామ రైతులను నట్టేట ముంచింది. శనివారం అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో ఆయా గ్రామాల్లో సాగుచేసిన వరి, పొగాకు పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఉదయాన్నే పొలాలకు వెళ్లిన రైతులు నేలవాలిన పైరును చూసి ఆందోళన చెందారు. కొండ్రముట్లలో పొగాకు మొక్కలు నేల వాలాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు నీటిలో తేలి ఆడుతూ దర్శనమిచ్చాయి. కోసిన వరి ఓదెలు నీటిపై తేలాడుతూ కనిపించాయి. కోతలు పూర్తయ్యి పొలాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం తడిసిందని రైతులు కన్నీరు మున్నిరవుతున్నారు.

పోలీసుల అదుపులో డిప్యూటీ మేయర్

2 లో

గంటల వారీగా కరెంటు బిల్లులు

- విద్యుత్ రంగం ప్రైవేటీకరణను తిప్పికొట్టాలి
- విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపు
- ఐక్యవేదిక గుంటూరు కన్వీనర్‌గా సలీం ఎన్నిక

ప్రజాశక్తి-గుంంటూరు

విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ల పరం కాకుండా కాపాడుకోవటానికి ప్రజలందరూ ఐక్యం కావాలని విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. విద్యుత్ రంగం ప్రైవేటీకరణ అయితే దేశ అభివృద్ధి అంధకారం అవుతుందని, ఒక్కసారి వారి చేతుల్లోకి వెళితే జియో రేట్లు పెంచుతున్న మాదిరిగా ప్రజలపై భారాలు మోపుతారని పలు అనుభవాలను వక్తలు ఉదహరించారు. స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీల భారాలపై విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో

మాట్లాడుతున్న విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక విజయవాడ కన్వీనర్ ఎంవి ఆంజనేయులు

రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఫెడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అండ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఫాక్వా) కన్వీనర్ ఎల్ఎస్.భారవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక విజయవాడ కన్వీనర్ ఎం.వి.ఆంజనేయులు ముఖ్యవక్తగా మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ వ్యవస్థను మొత్తం అదానీ, ఇతర బడా కార్పొరేట్లకు అప్పగించటానికి కేంద్ర ప్రభుత్వం పథకం ప్రకారం వ్యవహరిస్తోందన్నారు. విద్యుత్ పంపిణీని ప్రైవేటుకు అప్పగిస్తామని కోవిడ్ సమయంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారని గుర్తు చేస్తూ... తొలుత కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరిలో చేశారన్నారు. ఇప్పుడు ఛండీఘర్‌లో ప్రయత్నం జరుగుతోందని, యుపిలో ప్రైవేటీకరణను కార్మికులు తిప్పకొట్టారని అన్నారు. విద్యుత్ ఉత్పత్తి ప్రైవేటు సంస్థల నుండి అధిక ధరలకు కొనుగోలు చేయటం, విదేశాల నుండి బొగ్గు కొనుగోళ్లు, ప్రభుత్వ ఒప్పందాల ఫలితమే ప్రజలపై ప్రస్తుత

▶ 2లో

కమిటీ కన్వీనర్‌గా సలీం ఎన్నిక

దాదాపు 23 ప్రజా సంఘాలు, సంస్థలు హాజరైన ఈ సమావేశంలో విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక గుంటూరు కన్వీనర్‌గా మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం ఎన్నికయ్యారు. రాబోయే కాలంలో విద్యుత్ ప్రైవేటీకరణ, స్మార్ట్ మీటర్లు, భారాలకు వ్యతిరేకంగా ఐక్యవేదిక పోరాడుతుందని ప్రకటించారు.

పోలీసుల అదుపులో డిప్యూటీ మేయర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక విద్యానగర్ సమీపంలోని శాంతినగర్‌లో ఒక వివాదస్పద స్థలంలో నివాసం ఉంటున్న నగర డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు సోదరి నివాసంపై ఆదివారం టిడిపి నాయకులు విజయ్‌కిరణ్, మరికొంత మంది కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఇంటిలో ఉన్న సామాన్లను బయటకు విసిరేశారు. కుటుంబ సభ్యులను బయటకు నెట్టి ఇంటిని ఆక్రమించారు. విషయం తెలుసుకున్న డైమండ్‌బాబు పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ సోదరి ఇంట్లో అద్దెకు ఉంటుండగా టిడిపి వారు దాడి చేసి దౌర్జన్యం చేశారని డైమండ్‌బాబు ఆరోపించారు. తరువాత ఘటన స్థలం వద్దకు వెళ్లారు. ఈ స్థలం వద్ద పోలీసులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని డైమండ్‌బాబు ఆరోపించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు, డైమండ్‌బాబుకు వాగ్వావాదం జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తమను ఏకపక్షంగా సంబోధించారని, దూషించారని రాత్రి 9.30 గంటల సమయంలో పట్టాభిపురం పోలీసులు డైమండ్‌బాబును అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల జీపులో స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాత్రి 11 గంటల ప్రాంతంలో పోలీసు స్టేషన్‌కు వెళ్లి పోలీసు అధికారులలో చర్చిస్తున్నారు. వివాదంలో ఉన్న ఇంటిపై దాడి, ఆక్రమణ తరువాత ఇరు పక్షాలపై కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ ఇంటిని విఆర్‌ఒ సమక్షంలో అధికారులు సీజ్ చేశారు.

పరుగుల వీరుడు అబ్దుల్లాకు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణానికి చెందిన పరుగుల వీరుడు షేక్ అబ్దుల్లాకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ ఆర్థిక సాయం అందించారు. అబ్దుల్లా ఫిబ్రవరి 25న లడ్డాక్ (లే)లో జరగబోయే 42 కిలోమీటర్ల మారథాన్ గిన్నిస్ బుక్ పోటీల్లో పాల్గొనేందుకుగాను ఈ సాయాన్ని అందించారు. ఈ సందర్భంలో అక్కడే ఉన్న పలువురు స్పందించి ఆర్థిక సాయం చేసేందుకు స్వచ్ఛందగా ముందుకొచ్చారు. ఇందుకు సహకరించిన వినుకొండ డిగ్రీ కాలేజీ విశ్రాంత ఉద్యోగి ఎమ్‌డి కరీముల్లా, గుంటూరుకు చెందిన మైనార్టీ నాయకులు షేక అప్సర్, షేక్ జుబేర్‌కు అబ్దుల్లా కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ వైద్యులక అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆర్‌ఎంపిలకు కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్

మండల కేంద్రమైన రొంపిచర్లలో ఉన్న కేరళ మోడల్ స్కూల్‌లో ఆదివారం నరసరావుపేట శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంపి - పిఎంపి గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు జరిగింది. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆర్‌ఎంపి వైద్యులు సీజనల్ వ్యాధులు, సాధారణ వ్యాధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గుండె సంబంధిత వ్యాధులు తమ దృష్టికి వస్తే ప్రాథమికంగా వైద్య పరీక్షలు జరిపి అనంతరం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సిఫార్సు చేయాలని సూచించారు. అనంతరం గ్రామీణ వైద్యులకు మెడికల్ కిట్స్ పంపిణీ చేశారు. హాస్పిటల్స్ పిఆర్‌ఒ బాషా, గ్రామీణ వైద్యులు సిరిపరపు అంజిబాబు, నుసుం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాగొంతుక పిడిఎఫ్‌ను గెలిపించండి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

లక్షల మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా ప్రస్తుతం 3.40 లక్షల మంది ఓటర్లు ఉన్నారన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులు పార్టీలకు నాయకులకు వ్యతిరేకం కాదని కేవలం ఉద్యోగ, ఉపాధ్యాయ,చిరు ఉద్యోగులు, కార్మిక, కర్షక అనగారిన వర్గ ప్రజల శ్రేయస్సు కోసం పోరాటం చేయడమే లక్ష్యమన్నారు. పిడిఎఫ్ కు ఉద్యమాలు కొత్త కాదని స్వార్థ ప్రయోజనాలకు తావులేకుండా పని చేస్తున్న పిడిఎఫ్ ను పట్టభద్రులు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాన రాజకీయ పార్టీలు ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార మార్గాలపై స్పష్టమైన అవగాహనే పిడిఎఫ్ బలమని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజా పక్షపాతి , నిస్వార్థ ప్రజా పోరాటాలకు కేరాఫ్ కె.ఎస్ అని కొనియాడారు. జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు అదాని అభ్యర్థికి ఉపాధ్యాయ, ప్రజా సంఘాల అభ్యర్థికి జరుగుతున్న పోటీలో లక్ష్మణరావును గెలిపించుకోవాలని పిలుపిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి. ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల సాధక బాధలతో సంబంధం లేదని ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని చెప్పిన నేటి రాజకీయ నాయకులకు భిన్నంగా ఉద్యోగులు, ప్రజలు, పీడిత ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక కెఎస్ లక్ష్మణరావు లాంటి వ్యక్తులను గెలిపించకపోతే రాబోయే కాలంలో ప్రధానంగా ఉద్యోగులు తీవ్రమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రజా,ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కె.ఎస్‌కు అండగా ఉండాలని గెలుపునకు కృషి చేయాలని కోరారు. అనంతరం కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. రాధాకృష్ణ, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయ నాయక్, రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కట్టా కోటేశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు ఆంజనేయరాజు తదితరులు మాట్లాడారు. మండలి కన్నా ప్రజలతో ఎక్కువగా ఉండే కెఎస్ గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా సమన్వయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎం మోహనరావు, కో కన్వీనర్ గా ఎస్ ఆంజనేయ నాయక్, సభ్యులుగా కె. శ్రీనివాసరెడ్డి, పి. ప్రేమ్ కుమార్, జి విజయ సారథి, జి. మల్లేశ్వరి, ఎం. కోటేశ్వరరావు, రాధాకృష్ణ, ఏ. లక్ష్మీశ్వర రెడ్డి, ఏపూరి గోపాలరావు, జి రవిబాబు, ఆంజనేయరాజు, జి ధరణి, పెద్దిరాజు, సాయికుమార్ ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు తమ ప్రాంతాలలో జిల్లా, మండల కమిటీలు బూతు కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి శివకుమారి, సిఐటియు నాయకులు షేక్ శిలార్ మసూద్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు ప్రజాసంఘాలు నాయకులు పాల్గొన్నారు.

గంటల వారీగా కరెంటు బిల్లులు

(మొదటి పేజీ తరువాయి)

భారాలని తెలిపారు. అదానీకి లాభాలు చేకూర్చటానికి కేంద్రం 30 శాతం విదేశాల నుండి బొగ్గును కొనుగోలు చేయాలని షరతు విధించిందన్నారు. దేశీయంగా దొరికే బొగ్గు గరిష్ట ధర రూ.8500 మాత్రమే ఉండగా, కేంద్రం షరతు వల్ల ప్రభుత్వ థర్మల్ స్టేషన్లకు టన్నుకు రూ.12వేల నుండి గరిష్టంగా కొన్నిసార్లు రూ.19 వేలకుపైగా వెచ్చించి దిగుమతి చేసుకున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లను కూడా అదానీ కంపెనీ కోసమే ఏర్పాటు చేస్తున్నారన్నారు. ప్రజలకు తెలియకుండా వారి జేబులు కొట్టేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నారన్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు ద్వారా పీక్ అవర్‌కు ఒక విధంగా సాధారణ సమయంలో ఒక విధంగా రీడింగ్ తీసి, పీక్ అవర్‌కు అదనపు ఛార్జీలు వేస్తారన్నారు. సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో అదానీ ప్రభుత్వ ప్రభుత్వ పెద్దలకు రూ.1700 కోట్లు లంచం ఇచ్చినట్లు ఆధారాలున్నా కేంద్రంగానీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంగానీ ఎందుకు విచారణ చేపట్టలేదని ప్రశ్నించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలన్నారు.

మధ్య తరగతి ఉద్యోగుల కన్వీనర్ వివికె సురేష్ మాట్లాడుతూ సిఎంఐఇ నివేదిక ప్రకారం ఐదు లక్షల పరిశ్రమలు మూపతడ్డాయని, విద్యుత్ రేట్లు పెరిగితే మరిన్ని మూతపడే ప్రమాదం ఉందన్నారు. ట్రూ అప్ కంటే స్మార్ట్ మీటర్ల దోపిడీయే రాబోయే కాలంలో ఎక్కువగా ఉండబోతుందన్నారు. పౌర సంక్షేమ సంఘం నాయకులు కె.నళినీకాంత్ మాట్లాడుతూ విద్యుత్ ఒప్పందాల్లో లంచాల వ్యవహారం బయటపడ్డాక ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు అదానీ కంపెనీతో ఒప్పందాలను రద్దు చేసుకున్నాయన్నారు. అయితే భారతదేశంలో మాత్రం ప్రధాని మోడీ అండతో అదానీని కాపాడుతున్నారని, ఒప్పందాలను కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ చర్చావేదిక నాయకులు అవధానుల హరి మాట్లాడుతూ విద్యుత్ ప్రైవేటు పరమై ఛార్జీలు పెరిగితే అన్ని సరుల ధరలూ పెరిగిపోతాయని, ఇప్పటికే జీవన వ్యయం పెరిగి సామన్య ప్రజలు అల్లాడుతున్నారని చెప్పారు. సామాజిక కార్యకర్త బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ అని గొప్పలు చెబుతున్న ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు పెరిగితే పారిశ్రామిక వేత్తలు ఎలా వస్తారని ప్రశ్నించారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కె.గంగాధర్ మాట్లాడుతూ రాబోయే కాలంలో విద్యుత్ బస్సులు, వాహనాల సంఖ్య పెరుగుతుందని, విద్యుత్ రేట్లు పెరిగితే వాహనాల నిర్వహణ కూడా భారంగా మారుతుందని అన్నారు. ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగి చంద్రశేఖరావు, లోక్‌సత్తా నాయకులు సదాశివరావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ, సామాజిక కార్యకర్త చాముండేశ్వరి, కౌలురైతు సంఘం కార్యదర్శి బి.శ్రీనివాసరావు, తాండవకృష్ణ, శేఖర్‌రెడ్డి, అవగాహన సీనియర్ సభ్యులు మురళికృష్ణ తదితరులు మాట్లాడారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సందర్భంగా గుంటూరులోని ఒక కళ్యాణ మండపంలో ఆదివారం పట్టభద్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను భారీ మెజారిటితో గెలిపించాలన్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకష్ణుడు, పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్, చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, పత్తిపాటి పుల్లారావు, మొహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులు, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, పంచమర్తి అనురాధ, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ అబద్దయ్య, లిడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యాల రావు, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

డేగల యూత్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్

ప్రజాశక్తి-గుంటూరు

కులమతాలకు అతీతంగా నిర్వహించుకునే పండుగ క్రిస్మస్ అని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. డేగల యూత్ ఆధ్వర్యంలో శారద కాలనీలోని షెకీనా ప్రార్థన మందిరంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు డేగల ప్రభకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చర్చి పాస్టర్ జి.విజయ్‌కుమార్‌తో కలిసి కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేద వద్ద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డేగల యూత్ సునీల్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు మందగమనం

(మొదటి పేజీ తరువాయి)

3.85 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనాలు ఉన్నా అందులో 10 శాతం కూడా లక్ష్యం నిర్ధారించకపోవడం వల్ల అధికారులు మిల్లర్లపై వత్తిడి చేయలేకపోతున్నారు. దీంతో గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులు వినక తప్పడం లేదు.

గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 3 లక్షల టన్నుల బియ్యం కొనాలని లక్ష్యంగా నిర్ధేశించేవారు. జిల్లాల విభజన తరువాత జిల్లాకు లక్ష టన్నుల వరకు లక్ష్యం నిర్ధేశించే వారు. కానీ ఇప్పుడే విడతల వారీగా ప్రభుత్వం లక్ష్యం నిర్ధేశించడం వల్ల అధికారులు మిల్లర్లపై ఒత్తిడి చేయలేకపోతున్నారు. అంతేగాక రేషన్ బియ్యం కోసం పౌరసరఫరాల శాఖ జిల్లా నుంచి ఎక్కువ బియ్యం తీసుకోవడం లేదు. ఎక్కువగా ఇతర జిల్లాల నుంచి తీసుకోవడం వల్ల గుంటూరు, పల్నాడు జిల్లాల్లో లక్ష్యం తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో ధర కోసం వేచి ఉండే వారు మాత్రం పొలాల్లోనే కుప్పలు వేసి రబీ పంటలు కోతలు పూర్తయిన తరువాత మార్చి, ఏప్రిల్‌లో నూర్పిడి చేసి విక్రయిస్తుంటారు. వేచి ఉండలేని రైతులు తక్కువ ధరకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాకుమాను మండలం రేటూరు-అప్పాపురం మధ్య పొలాల వద్ద ఆరబోసిన ధాన్యం

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన Grihum Housing Finance Limited, (Formerly known as Poonawalla Housing Finance Ltd,) Guntur వారి సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ వద్దకు షేక్ నయాబ్ రసూల్ తండ్రి షేక్ కాజా మస్తాన్ కింద దిగువ కనబరిచిన ఐటమ్ 1 & ఐటమ్ 2 కొనుటకు లోన్ కోసం నా క్లయింట్ వద్దకు సంప్రదించివున్నారు. ఈ ప్రాపర్టీ మెయిన్ డాక్యుమెంట్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెంబర్ 5697/2023, తేది 10-10-2023 తెనాలి ఎస్.ఆర్.ఓ, దీని ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ అయినటువంటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ No.6/1997 తేది 22-11-1997న తెనాలి ఎస్.ఆర్.ఓ., పోయినవి. సదరు వియషము మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ వారికి ఫిరియాదు చేసి వారి వద్ద నుండి నాన్ ట్రేసబుల్ సర్టిఫికేట్ నెం. MLD012400486916 Dt. 20/12/2024 పొందివున్నాము అని చెప్పి అట్టి ఆస్థికి నా క్లయింట్ రుణము కొరకు సంప్రదించి ఈ దిగువ సదరు షెడ్యూలు ఆస్థిపై గాని, పోయిన దస్తావేజులపై గాని, పొందబోవు రుణముపై గాని ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరములు, క్లయిమ్‌లు, సెక్యూరిటీలు, హక్కులు వున్నచో 7 రోజుల లోపు వ్రాత పూర్వకంగా ఈ అడ్రస్‌కు తెలియజేయవలెనని గడువులోపల ఎటువంటి క్లెయిమ్‌లు తెలియజేయనిచో నిష్పేచి ఆస్థిగా పరిగణించబడునని మరియు గడువు అనంతరం వచ్చు ఆక్షేపణలు, వగైరాలు నా క్లయింట్ హక్కులను బైండు చేయజాలవు.

SCHEDULE :

Item:1 as per Registered Sale Deed Document No.5697/2023 Dt.10-10-2023 Tenali SRO. Guntur District, Tenali Sub-District, Tenali Municipal Corporation, Survey T.S.No.208, Ward:7, Block:6, Extent: 48-6 Sq.yards Vacant site

BOUNDIRES :

North: Shaik Mastan Bi Property 36-1 ½ Ft
South: Mohammad Mukthiyar Ahammad Property 36-1 ½ Ft
East: Shaik Gouse Etc Site 12-7 Ft
West: 12 Ft Wide Municipal Bazar 11-6 Ft

Item : 2 as per Registered Sale Deed Document No.5698/2023 Dt.10-10-2023 Tenali SRO Guntur District, Tenali Sub-District, Tenali Municipal Corporation, Survey T.S.No.208, Ward:7, Block:6, Extent: 48-6 Sq.yards Vacant site

BOUNDIRES :

North: Shaik Jabeen Site 36-1 ½ Ft
South: Eturi Guravaiah Etc 36-1 ½ Ft
East: Shaik Gouse Etc Site 12-7 Ft
West: 12 Ft Wide Municipal Bazar 11-6 Ft

శ్రవణ్ త్రిపురమల్లు, B.A., LL.M.,
Advocate, D.No. 22-11-69,
Lalapet, Guntur. Cell : 9032457497

రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం

భార్యకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపర మండల పరిధిలోని పిడపర్రు లాకుల వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం పాలవుగా, అతని భార్య తీవ్ర గాయాల పాలైంది. ఆదివారం చోటు చేసుకున్న సంఘటన వివరాలు పోలీసులు తెలిపారు. కొల్లూరు గ్రామానికి చెందిన ఎం ఆంజనేయులు భార్యతో కలిసి ద్విచక్రవాహనం పై విజయవాడ నుండి స్వగ్రామమైన కొల్లూరు కు వస్తున్నాడు. ఈ క్రమంలో పిడపర్రు లాకుల వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఏపీ 31 టీవీ 7722 నెంబర్ గల కారు డ్రైవర్ అతి వేగముగా వచ్చి బైకును ఢీ కొంది. ఈ సంఘటనలో మట్ట ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన అతని భార్యను చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశా లకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

అనుమతులు లేకుండా విగ్రహం ఏర్పాటు

తెనాలి మున్సిపల్ అధికారులు తొలగింపజేస్తుండగా ఉద్రిక్తత - పోలీసులకు స్థానికులకు వాగ్వాదం - విగ్రహం తొలగింపు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మేరీ మాత విగ్రహం తొలగింపు పై స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలో ఆదివారం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. సిఎం కాలనీ 8వ లైన్లో రాత్రికి రాత్రి మేరీ మాత విగ్రహాన్ని స్థానికులు నెలకొల్పారు. రానున్న క్రిస్మస్ పండగ నేపథ్యంలో తమ ఆరాధ్య దైవాన్ని మున్సిపాలిటీ స్థలంలో ఏర్పాటుచేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న పురపాలక సంఘం అధికారులు అక్కడికి చేరుకున్నారు. అనుమతులు లేకుండా మేరీ మాత విగ్రహం ఎలా ఏర్పాటుచేస్తారని టౌన్ ప్లానింగ్ అధికారులు స్థానికులను ప్రశ్నించారు. అధికారులు భారీ జెసిబి సహాయంతో విగ్రహాన్ని తొలగించడానికి ఉపక్రమించారు. తాము అరధ్యంగా కొలిచే విగ్రహం తొలగించవద్దు అంటూ మున్సిపల్ అధి కారులను ప్రాధేయపడ్డారు. ఇరువురి మధ్య ఘర్షణ వాతావణం నెలకొనడంతో అధికారులు మూడో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. స్థానికులకు పోలీసులకు మధ్య స్వల్ప వివాదం నెలకొంది. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించడం సరికాదని పోలీసుల సహాయంతో విగ్రహాన్ని తొలగించారు. విగ్రహ తొలగింపుకు నిరాకరించిన కొందరు యువకులు క్రేన్ పైకి రాళ్ళు రువ్వారు. ఈ క్రమంలో పోలీసులకు యువకులకు తోపులాట జరిగింది. సిఐ రమేష్ మెడపై స్వల్ప గాయాలయ్యాయి. పక్కనే వున్న అంకమ్మతల్లి గుడిని కూల్చకుండా మేరీ మాత విగ్రహాన్ని ఎలా తొలిగిస్తారని కొంతమంది మహిళలు ప్రశ్నించడంతో పోలీసులు స్వల్ప లాఠీ చార్జి చేయవలసి వచ్చింది. గత్యంతరం లేని పోలీసులు అంకమ్మ గుడికి చెందిన దిమ్మెతో పాటు చుట్టు గుడికి సంబంధించిన పరిసరాలను కూడా తొలగించారు. 17 ఏళ్లగా కొలుపులు అందు కుంటున్న తమ దేవత ప్రతిమను తొలిగించారంటూ అక్కడి స్థానికులు పోలీసులను ప్రశ్నించారు. ఖాళీగా వున్న మున్సిపల్ జాగాలో దేవతల విగ్రహాలను ప్రతిష్టించుకుంటే నష్టం ఏమిటని ఇరువర్గాలు స్థానికులు తమ వాదనలను వినిపిస్తున్నారు.

సమావేశంలో పాల్గొన్న సభ్యుల

ముగిసిన ఎపి మాస్టర్ ప్రింటర్స్ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎపి మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవి ప్రియ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన అసోసియేషన్ సమావేశానికి పట్టణంలో పలువురు ప్రింటర్స్ యాజమాన్యం పాల్గొన్నారు. కార్యక్రమంలో నూతన కమిటి పరిచయం, అసోసియేషన్ ఆర్థికంగా బలపడటానికి కారణాలు, సభ్యుల సలహాలు, సూచ నలు తదితర అంశాలపై చర్చలు నిర్వహించారు. సభను విజయ వంతంగా నిర్వహించిన సభ్యులను సంస్థ అధ్యక్షులు డి అమర్నాథ్, కోశాధికారి ఎస్ వి ఉమామహేశ్వరరావు అభినందించారు.

అక్షయపాత్రను సందర్శించిన గుడివాడ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆత్మకూరు లోని ఉన్న అక్షయపాత్ర ఫౌండేషన్ కేంద్రీకృత వంటశాల ను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సందర్శించారు. ఈ కిచెన్ ఆంధ్రప్రదేశ్ లోనే అతి పెద్ద కిచెన్, 3 ఎకరాలు భూమిలో ఈ వంటసాలను ఏర్పాటు చేయగా 4 గంటల్లో 1లక్ష మందికి భోజనం తయారు చేయగల సామర్థ్యంతో ఏర్పాటు చేయటం జరిగిందని ఎమ్మెల్యేకు అక్షయపాత్ర ప్రతినిధులు వివరించారు. ఇటీవలే వచ్చిన కృష్ణానది వరదల సమయంలో ఈ వంటసాల నుంచే 16 లక్షల మందికి ఆహారం సరఫరా చేయటం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను చూసిన వంటసాలల్లో ఇది పరిశుభ్రంగా కనిపించిందని చెప్పారు. అక్షయపాత్ర ఫౌండేషన్ మరియు హరే కృష్ణ మూవ్మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆఫ్ సెంట్రల్ రీజియన్ అధ్యక్షులు వంశీధర దాసు, ఎమ్మెల్యే రాము ను మర్యాదపూర్వకంగా స్వాగతించారు.

ముగిసిన ఖోఖో పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

విజేతలకు బహుమతులు అందచేస్తున్న అతిధులు

స్థానిక టిజెపిఎస్ కళాశాలలో రెండ్రోజులపాటు జరిగిన ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ అంతర కళాశాలల ఖోఖో (పురుషుల) పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో నర్సరావుపేట విక్టరి డిగ్రీ కాలేజి ప్రధమ స్థానం, ఇంకొల్లు డిసిఆర్యమ్ కళాశాల ద్వితీయ స్థానం, నర్సరావుపేట కృష్ణవేణి డిగ్రీ కాలేజి తృతీయస్థానం, వాగ్దేవి డిగ్రీ కళాశాల నాలుగో స్థానం సాధించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం తెలియజేశారు. ముగింపు సందర్భంగా విజేతలకు వెంకటేశ్వరస్వామి దేవస్థానం జాయింట్ సెక్రెటరీ ఊటుకూరి నాగేశ్వరావు, జయ కాటన్స్ ప్రొప్రైటర్ ఎన్.సుబ్బారావు పాల్గొని బహుమతులు అందజేశారు. నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని అన్నారు. సుబ్బారావు మాట్లాడుతూ క్రీడాకారులకు క్రమశిక్షణ చాలా ముఖ్యమని క్రమశిక్షణతో ఉంటే లక్ష్య సాధన సులభం అవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ వి.కష్ణానంద్, కళ్ళం ఇంజినీరింగ్ కాలేజి సెక్రెటరీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొని విజేతలకు నగదు పురస్కారాలు అందిచారు. అనంతరం 15 మంది క్రీడాకారులతో యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ అబ్జరర్ డాక్టర్ సూర్య నారాయణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఆర్ శివాజీ,ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితాదేవి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు క్రిస్మస్ కానుకలు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

కానుకలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

మంగళగిరి టౌన్ 21 వ వార్డు పరిధిలోని ఆరు ప్రార్ధన మంది రాలలో దైవ సేవకులకు క్రిస్మస్ సందర్భంగా మంత్రి నారా లోకేష్ పంపిన క్రిస్మస్ కానుకలను టిడిపి నాయకులు ఆదివారం రాత్రి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోకల బాలాజీ, వంగర రమేష్, గంటా దుర్గా ప్రసాద్, గోలి మధు, గుంటిప్రతాప్, దైద యాకోబు కుక్కమళ్ళ క్రాంతి, మద్దిమడుగు పాండురంగ, వల్లపదాసు నారాయణ, అందే వీరాస్వామి తదితరులు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

చిన్నేరు కుంట, మణిపురం ఫ్లైఓవర్ ఇరువైపులా ఆక్రమణలు తొలగించి, ఆ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ఆదివారం కమిషనర్ స్థానిక ఆర్టీసి కాలనీరోడ్డులోని చిన్నేరుకుంట, మణిపురం ఫ్లైఓవర్ ప్రాంతాల్లో పర్యటించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ చిన్నేరు కుంటని పరిశీలించి, గతంలో చేపట్టిన పనులు, పెండింగ్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని, పనుల వేగవంతంకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కుంట చుట్టూ వాకింగ్ ట్రాక్ వంటి అభివద్ధి పనులను చేపట్టడానికి ఇంజినీరింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మణిపురం ఫ్లై ఓవర్ కి ఇరువైపులా ఆక్రమణలను పరిశీలించి తక్షణం ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ ప్రారంభించాలని, అవసరమైతే పోలీసు సహకారం తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటీప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్ కుమార్, ఏసిపి మల్లికార్జున, టిపిఎస్ లక్ష్మణస్వామి, డిఈఈ నాగభూషణం, ఏఈ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం

కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబాలు

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని సుద్ధపల్లి గ్రామంలో మాదిగ పల్లిలో ఆదివారం మధ్యాహ్నం రెండు పూరీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధితులు కోడూరి ప్రభుదాస్, కొమ్ము కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం తాము ఉమ్మడికుంటుంబమని, రెండు పూరిళ్లు పక్కపక్కనే ఉంటాయని తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించిందన్నారు. ఈ ఘటనలో రెండు సిలెండర్లు పేలడంతో ప్రమాదం తీవ్రత పెరిగిందన్నారు. రెండు పూరిళ్లు వస్తువులతో దగ్ధం అయ్యాయని, తాము కట్టు బట్టలతో మిగిలామని తెలిపారు. సంఘటా స్థలాన్ని తహశీల్దార్ కె శ్రీనివాస శర్మ పరిశీలించారు. ఫైరింజన్ సాయంతో మంటలు అదుపు చేశా మన్నారు. దాదాపు రూ.3లక్షల ఆస్థినష్టం జరిగిందనితెలిపారు.

వివా వివిఐటి యువజనోత్సవం.. ఉరకలెత్తిన ఉత్సాహం..

ప్రజాశక్తి-గుంటూరు

నంబూరులోని వివిఐటి ఇంజినీరింగ్ కాలేజిలో రెండ్రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి యువజనోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిసాయి. రెండవ రోజు యువజనోత్సవంలో భాగంగా సాంకేతిక, సాంస్కృతిక క్రీడలు యువతను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కేరింతలతో ప్రాంగణం మారుమ్రోగింది. ఆట, పాటలతో విద్యార్థులు ఉర్రూతలూగించారు. ఈ వేడుకలలో సాహితీ ప్రహేళిక, ఆధునిక అష్టావధానం, జానపద, శాస్త్రీయ నత్యం సంగీతం వంటి సాంస్కృతిక అంశాలతో పాటుగా కోడ్ రివైంట్, ట్రెజర్ హంట్, మ్యాట్లైబ్ మిస్టరీ, క్యాడ్ కాంటెస్ట్, బ్రెయిన్లీ బవుంట్ వంటి సాంకేతిక అంశాలలో పోటీలు నిర్వహించారు. అలాగే బాస్కెట్బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో క్రీడలు ఉత్కంఠతోసాగాయి. విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాషామాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ముగింపు వేడుకలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా చలపతి ఇంజినీరింగ్ కాలేజి సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వివిఐటి కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ పాల్గొని, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందచేశారు. వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టాన్ని, శ్రమను నమ్ముకోవాలని, తద్వారా మెరుగైన భవిషత్తు పొందగలుగుతారని అన్నారు. అవకాశాలను పూర్తిస్థాయిలో అందిపుచ్చుకొని విజయాలను సాధించాలని అన్నారు. ఎస్. వెంకటేశ్వర్లు మాట్లడుతూ యువత దేశ భవిష్యత్తు అని, సరైన లక్ష్యాన్ని ఎంచుకొని విజయాన్ని సాధించాలని అన్నారు. కార్యక్రమములో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

230 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి - యడ్లపాడు

బీపీ, షుగర్ బాధితులకు బాసట సామాజిక సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మండల కేంద్రమైన యడ్లపాడులోని పిఆర్ విజ్ఞాన కేంద్రంలో 230 మందికి పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ లింగమల్లు మోహన్ భాస్కరరావు, డాక్టర్ సొంటినేని నవ్య శ్రీ, ఫార్మసిస్ట్ రావూరి సౌమ్య పేషెంట్లకు తగిన సూచనలు సలహాలు అందించారు. వాలంటీర్లకు సీనియర్ లెక్చరర్ రావూరి దేవయ్య భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బాసట సభ్యులు ఎన్.కాళిదాసు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.రవీంద్రబాబు, ఎస్.వెంకటార్జున్, కె.రామబ్రహ్మం, ఎం.విజయ్ కుమార్, పి.శ్రీనివాసరావు, బి.రాజేష్ కుమార్, ఎం.వేణుగోపాల్, ఆర్.సుమన్, కె.రామోజీరావు, ఎం.సాయి, ఆర్.సురేష్ పాల్గొన్నారు.

చిలకలూరిపేట నుండి కొత్త బస్సులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గత ప్రభుత్వం ఆర్టీసీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే దాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో చిలకలూరిపేట నుండి విజయవాడ, హైదరాబాద్‌కు నూతన బస్సు సర్వీసులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1400 నూతన బస్సులు అందుబాటులోకి తెచ్చామని, త్వరలో మరో రెండువేల బస్సులు రానున్నాయని అన్నారు. బస్టాండ్‌లోని ప్రయాణికులతో మాట్లాడి సేవలపై వివరాలు తెలుసుకున్నారు. బస్టాండ్ పరిసరాలు, సిసి కెమెరాలతో పాటు క్యాంటీన్, షాపులను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యతపై వినియోగదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రయాణికుల భద్రతపై డిపో సిబ్బందితో మాట్లాడారు. డిపో మేనేజర్ రాంబాబు, నాయకులు షేక్ కరిముల్లా, జనసేన ఇన్‌ఛార్జి టి.రాజారమేష్, జె.మధన్ మోహన్, కె.సాయిబాబు పాల్గొన్నారు.

మూగజీవాల మృత్యువాత

- తెల్లవారుజామున మందపైకి దూసుకొచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు
- 150 గొర్రెలు, మేకలు మృతి
  40 జీవాలకు తీవ్రగాయాలు
- ఆస్పత్రిపాలైన ఇద్దరు పెంపకందార్లు

ప్రజాశక్తి - దాచేపల్లి

మూగ జీవాలపైకి దూసుకొచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 150కుపైగా గొర్రెలు, మేకల్ని పొట్టన పెట్టుకుంది. వాటినే నమ్ముకుని కుటుంబాల్ని పోషించుకునేవారి జీవనోపాధిపై దెబ్బకొట్టడంతోపాటు ఇద్దరు పెంపకం దార్లనూ ఆస్పత్రి పాల్జేసింది. మరో 40 జీవాలుసైతం తీవ్రంగా గాయపడి అల్లాడుతున్నాయి. దాచేపల్లిలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారి ఫ్లై ఓవర్‌పై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘటనపై వివరాల ప్రకారం..

జీవాల పెంపకందార్లు ప్రతిఏటా పల్నాడు ప్రాంతానికి తమ జీవాలను తోలుకుని వస్తుంటారు. ఖరీఫ్ సీజన్ ముగింపు సమయంలో వచ్చి పత్తి పొలాల్లో పంటకోతలు పూర్తయ్యాక ఆయా పొలాల్లో మేకలు, గొర్రెలను మేపుకుంటూ ఉంటారు. ఇందులో భాగంగా తెలంగాణలోని నారాయణపేట జిల్లా నారాయణపేట మండలం కోలంపల్లి గ్రామానికి చెందిన ఆవుల మల్లేష్, నెంబర్ పోచ కర్రెప్ప, మరో ఇద్దరితోపాటు మల్లేష్ కుమారుడు కూడా తమ 600 జీవాలను మేపుకోవడానికి కొద్దిరోజుల కిందట పల్నాడుకు వచ్చారు. ఒక్కో గ్రామంలో జీవాలను మేపుతూ ఇటీవలే గురజాల మండలం పులిపాడుకు వచ్చారు. శనివారం రాత్రి దాచేపల్లి మండలం నడికుడిలో బస చేసి ఆదివారం తెల్లవారుజామునే సారంగపల్లి అగ్రహారానికి బయలుదేరారు. దాచేపల్లి పట్టణంలోని అలంకార్ థియేటర్ సమీపంలో అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారి మీద ఫ్లైవోవర్‌పై వెళ్తుండగా 5.30 గంటల సమయంలో హైదరాబాద్ నుండి బాపట్ల జిల్లా ఇంకొల్లుకు వెళ్తున్న శ్రీమారుతి ట్రావెల్స్ బస్సు వెనక నుండి వచ్చి జీవాల మందపైకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారవ్వగా బస్సులోని ప్రయాణికులు ఎవరికి వారు ఇతర వాహనాల్లో వెళ్లిపోయారు. క్షతగాత్రులైన మల్లేష్, కర్రెప్పను స్థానికులు 108 ద్వారా గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. మల్లేష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది.

న్యాయం కోసం రాస్తారోకో

మరోవైపు ఈ ఘటనపై స్థానిక యాదవ సంఘాలు, చుట్టుపక్కల గ్రామాల్లోని జీవాల పెంపకందారులూ ఘటనా స్థలికి చేరుకుని ఆందోళన చేపట్టారు. బాధితులకు న్యాయం చేయాలని రహదారిపై బైఠాయించారు. ఇది తెలిసిన సిఐ భాస్కరరావు ఘటనా స్థలికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడగా.. చనిపోయిన జీవాల విలువ రూ.20-25 లక్షలకుపైగా ఉంటుందని, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని, వారి పరిస్థితి ఏమిటని నాయకులు ప్రశ్నించారు. న్యాయం చేయాల్సిందేనని, అప్పటి వరకూ మృతి జీవాలను, బస్సును కదలనివ్వ బోమని పట్టుబట్టారు. అనంతరం పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు అక్కడికొచ్చి ఆందోళనకారులతో మాట్లా డారు. వాహనాలు భారీగా నిలిచి ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. ప్రమాదానికి కారణమైన బస్సులోని పత్రాల ఆధారంగా యాజమాని హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి అతనితో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఆందోళన విరమించాలని సంఘాలను కోరినా వారు పరిహారంపై తేల్చాలని పట్టుబట్టారు. ఈలోగా టిటిడి పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తికి విషయం తెలియడంతో ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతి చెందిన జీవాలను పరిశీలించారు. ఎస్పీ శ్రీనివాసరావుతో చర్చించారు. అనంతరం ఆందోళనకారులతో మాట్లాడారు. బస్సు యజమాని పిలిపిస్తామని, నష్టపోయిన వారికి న్యాయం తీసుకునేలా అన్ని విధాలుగా కృషి చేస్తామని హామీనిచ్చారు. ప్రభుత్వ పరంగానూ అండగా ఉంటామని హామీనివ్వడంతో వారు రాస్తారోకోను విరమించారు.

అనంతరం మృతిచెందిన జీవాలను దాచేపల్లి నగర పంచాయతీ కార్మికుల ద్వారా వాహనాల్లో వేసి స్థానిక మార్కెట్ యార్డుకు తీసుకెళ్లారు. వాటికి పశువుల వైద్యులు పోస్టుమార్టం చేసిన తర్వాత తహశీల్దార్ కుటుంబరావు, దాచేపల్లి సిఐ భాస్కరరావు, పశువుల వైద్యుల సమక్షంలో ఊరి వెలుపల ప్రభుత్వ భూమిలో పూడ్చిపెట్టారు. పోలీసులు కేసు నమోదు చేశారు. అడ్మిన్ ఎస్పీ జెవి. సంతోష్, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, ఎస్‌బి సిఐ బి.సురేష్‌బాబు, ఎస్ఐలు ఘటనా స్థలిని పరిశీలించారు.

తెల్లవారుజామున ప్రయాణం వద్దు

ప్రమాదంపై ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాత్రివేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తాజా ప్రమాదం డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల జరిగిందేనన్నారు. రాత్రుళ్లు వాహనాలు నడిపే డ్రైవర్లు తమ వాహనాలను తెల్లవారుజామున ప్రయాణాలు వద్దని, 2 గంటల నుండి 6 గంటల వరకు పార్కింగ్ స్థలాల్లో నిలిపి నిద్రపోవాలని సూచించారు.

నిశ్చేష్టుడైన బాలుడు

ప్రమాదం జరిగిన సందర్భంలో అక్కడే ఉన్న జీవాల పెంపకందారుడైన మల్లేష్ కుమారుడు పదేళ్ల శ్రీకాంత్ ప్రమాదాన్ని చూసి షాక్‌కు గురయ్యాడు. దాదాపు ఐదు గంటలపాటు ఆ ఘటన నుండి తేరుకోలేకపోయాడు. ఏమి అడిగినా సమాధానం చెప్పలేకపోవడంతోపాటు పేరు చెప్పడానికీ తడబాటుకు గురయ్యాడు.. పెద్ద శబ్దం వచ్చిందని.. గొర్రెలు చచ్చిపోయాయని.. అని ఆందోళనగా చెప్పాడు.

అధ్వానంగా పారిశుధ్యం.. రోగాల భయం..

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలో పారిశుధ్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నట్లు లెక్కల్లో చూపుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అధ్వాన్నంగానే ఉన్నాయి. మురుగు ఎక్కడికక్కడే నిలిచి దోమల ఉధృతితో జనం అల్లాడుతున్నారు. చిలకలూరిపేట మున్సిపాలిటీగా ఏర్పడి దశాబ్దాలు గడిచినా తొలినాళ్లలోని మురుగు కాల్వలే నేటికీ కొనసాగుతున్నాయి. మురుగు కాల్వలు ఆధునీకరించకపోవటంతో మురుగు పారుదల లేక పట్టణంలోని మురికి వాడలు దోమల పెంపకం కేంద్రాలుగా మారాయి. అంతే కాకుండా టిఫిన్ బండ్ల వారు ప్లాస్టిక్ కవర్లు, ఆకులు కాల్వల్లో వేయటం వల్ల నీరు నిలిచిపోతుంది. నివారించాల్సిన అధికారులు చూసి చూడనట్లు ఉంటున్నారు. కనీసం టిఫిన్ బండ్ల పరిసరాలు కూడా శుభ్రంగా ఉండట్లేదు. పేదలవాడల్లో నీరు బయటకు పోయే మార్గం లేక దుర్వాసన వెదజల్లుతోంది.

12వ వార్డులో మురుగు నీటితో నిండిన చెరువు

ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, కంప పెరిగి దోమలకు ఆవాసాలుగా మారాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జికా వైరస్ వణికిస్తున్న నేపథ్యంలో పట్టణంలో దోమల వ్యాప్తితో ప్రజలు ఆందోళణ చెందుతున్నారు. గతంలో గుంటూరు, విజయవాడ లాంటి మహా నగరాల్లో డెంగీ, మలేరియా, అతిసారతో అనేక మంది ప్రాణాలు కోల్పోయినా ఇక్కడ అధికారులకు చలనం ఉండట్లేదు. ఇటీవల నెల్లూరు జిల్లాలో జికా వైరస్ అనుమానిత బాలుడిని చికిత్స కోసం చెన్నైకి తరలించిన విషయం తెలిసిందే... ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి చెరువుల్లోని నీరు తొలగించి పార్కులుగాగానీ, కళ్యాణ మండపాలుగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి చెట్లు తొలగించుకునేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. కాల్వల్లో పూడిక తీయటంతోపాటు, బ్లీచింగ్ చల్లి, దోమలు ప్రబలకుండా చూడాలని, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించాని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ భారాలపై నిరసనలు

గుంటూరు రత్నగిరి నగర్‌లో ఆందోళన

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానిక గుజ్జనగుండ్ల, రత్నగిరి నగర్ రైల్వే ట్రాక్ ప్రాంతంలో సిపియం ఆధ్వరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నగర కమిటీ సభ్యులు షేక్.ఖాసింవలి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా బాదుడే బాదుడు అన్న చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కూటమి బాదుడు చూపిస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే అవసరం అయితే వాటిని పగులగొట్టాలని నారాలోకేష్ పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చాక ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆరు నెలల కాలంలోనే రెండు దఫాలుగా దాదాపు రూ.15వేల కోట్లకుపైగా విద్యుత్ భారాలు మోపిందన్నారు. రూ.1700 కోట్లు లంచం ఇచ్చి

సోలార్ ఒప్పందాలు కుదుర్చుకున్న అదానీపై కూటమి ప్రభుత్వం విచారణ చేయకుండా ఎందుకు నోరెత్తట్లేదని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు ఎవరు అడిగారని ఏర్పాటు చేస్తున్నారన్నారు. అదానీ కంపెనీ లాభాల కోసం ఏర్పాటు చేస్తున్నారని, వాటికయ్యే ఖర్చును కూడా ప్రజల నుండే వసూలు చేస్తాన్నారు. రాబోయే కాలంలో ఇష్టం వచ్చినట్లు బిల్లులు వసూలు చేస్తారన్నారు.కావున ప్రజలు ఈ భారాలను ఐక్యంగా తిప్పకొట్టాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు షకీలా నాయకులు, ఐ. బాబురావు, కె.నాని, ప్రసాదు, చిన సైదులు, పి గోపి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వి వి జవహర్లాల్ అన్నారు. ఆదివారం రాత్రి మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం ఎం బాలాజీ అధ్యక్షతన జరిగింది. జవహర్లాల్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఎన్నికలకు ముందు టిడిపి కూటమి పార్టీల నాయకులు అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచను అని చెప్పారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు నెలల్లోనే 18 వేల కోట్ల రూపాయలను సర్దుబాటు, ట్రూ ఆప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపారు అని విమర్శించారు. కేంద్ర హెూం మత్రి అమిత్ షా అంబేద్కర్ గురించి హేళన చేస్తూ మాట్లాడడం దారుణమని అన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు పోరాటాలను ఉదతం చేయాలని

మాట్లాడుతున్న వివి జవహర్లాల్

పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించడానికి ఆయా శాఖలు పరిధిలో కషి చేయాలని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు ఎస్ఎస్ చంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎం చలపతిరావు, టి శ్రీరాములు, ఎస్ గణేష్, జే బ్రాహ్మణి, ఎం చంద్రారావు, ఆర్ వేణు, కే శ్రీనివాసరావు, పి రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో విద్యుత్ బిల్లుల దహనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్ చార్జీలు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై బారాలకు వ్యతిరేకంగా ఆత్మకూరు గ్రామ సెంటర్లో ఆదివారం విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మొసలి పకీరయ్య, శాఖ కార్యదర్శి నల్లక శ్రీధర్, వి.సాంబశివరావు, కే.శేషయ్య, జనార్ధనరావు శర్మ, రామారావు, సుబ్బారావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో విద్యుత్ బిల్లుల దహనం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

తాము అధికారంలోకి వస్తే అదనపు విద్యుత్ బిల్లులు వేయిబోమని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ప్రజలపై అదనపు విద్యుత్ బారాలు వేస్తుందని, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అన్నారు. ఆదివారం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి నటరాజ కళామందిరం వద్ద సిపిఎం శ్రేణులు విద్యుత్ బిల్లుల దహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒక మాట, అధికారం చేపట్టాక మరొక మాటను చెబుతూ ప్రజలను మోసం చేస్తుందని ఆయన అన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం లో పెంచిన విద్యుత్ బిల్లులకు తెలుగుదేశం ప్రభుత్వం బాదుడే బాదుడు అంటూ విమర్శించి, నేడు ప్రజలపై ట్రూ అప్ చార్జీల పేరుతో అదనపు భారాలు వేయడం సిగ్గుచేటు అన్నారు. సిపిఎం కుంచనపల్లి గ్రామ రెండవ శాఖా కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తుందని ఆయన అన్నారు. ఒకవైపున అధిక ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ధరలు తగ్గించకపోగా, సర్దుబాటు చార్జీల పేరుతో గతంలో 2022, 2023 సంవత్సరం వాడిన విద్యుత్ వాడకానికి డబల్ చార్జీలు వేసి విద్యుత్ బిల్లులు కట్టమనడం ప్రజలు నడ్డి విరచడమేనని ఆయన ఎద్దేవా చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు అమ్మిశెట్టి రంగారావు మాట్లాడుతూ ఇటు వ్యవసాయ రంగం పైన, అటు సామాన్య ప్రజల పైన అధిక బారాలు వేసే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు వ్యతిరేకిస్తారని, ప్రజా వ్యతిరేక విధానాలకు సిపిఎం పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని ఆయన అన్నారు. పెంచిన అదనపు విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. అనంతరం సిపిఎం శ్రేణులు విద్యుత్ బిల్లులను దహనం చేశారు కార్యక్రమంలో నాయకులు బడుగు వెంకటేశ్వరరావు, కొండపల్లి హరీష్, సుబ్బారావు, బాకీ చిన్నబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణా అవసరం

అడిషనల్ కమిషనర్ కె.శకుంతుల - ఘనంగా నిర్మల పాఠశాల 42వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

విద్యార్థులు చిన్ననాటినుండి విద్యతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కె శకుంతల పేర్కొన్నారు. నిర్మల పాఠశాల 42వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి పరీక్షల ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను ఈ సందర్భంగా అందజేశారు. కార్యక్రమంలో శకుంతల మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు ఆటలు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల కూడా ప్రతిభ కలిగి ఉండాలని సూచించారు. అన్ని రంగాల్లో తర్ఫీదు ను అందిస్తున్న నిర్మల పాఠశాల సేవలను కొనియాడారు. రెవరెండ్ ఫాదర్ జోసెఫ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థికి వినయం విధేయతా చాలా అవసరమని చెప్పారు. డాక్టర్ వి విజయ అకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమయం ఉదయం వధా చేసుకోకుండా సమయపాలన పాటించాలని చెప్పారు. సిస్టర్ యు శౌరీలు మాట్లాడుతూ నిర్మల పాఠశాల

ఎంతోమంది విద్యార్థులకు చదువు నేర్పిస్తూ వారి అభివద్ధికి తోడ్పడుతుందని చెప్పారు. పడతల కరస్పాండెంట్ సిస్టర్ జాన్ పాల్, పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ జ్ఞాన సౌందరి లు ముఖ్య అతిథులకు సాంప్రదాయ పద్ధతిలో సన్మానించారు. గత 30 సంవత్సరాల నుండి నిర్విరామంగా పాఠశాల కు సేవలందించిన ఉపాధ్యాయులైన సహాయరాని సువిశేషారావు, రత్న లను సన్మానించారు. కార్యక్రమం విజయవంతమైన కషి చేసిన అందరికీ ధన్యవాదాలు తెలియజేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

పిడిఎఫ్‌ను బలోపేతం చేయండి : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి 2025 మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్‌గా తిరిగి తనను గెలిపించాలని కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఆదివారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో జరిగిన స్టడీ సర్కిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2007 నుండి శాసన మండలిలో పిడిఎఫ్ తరపున అనేక ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశానని చెప్పారు. రాజ్యాంగ లక్ష్యాలకు కట్టుబడి, పనిచేస్తూ నిజాతీయగా, నిబద్ధతతో ఉన్నానని చెప్పారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, నిరుద్యోగులు, అంగన్‌వాడీలు, కార్మికులు, రైతులు, మహిళలు మొదలైన వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. ఇక ముందు కూడా కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తామని, పిడిఎఫ్‌ను బలోపేతం చేయటానికి తనను బలపర్చాలని కోరారు. సమావేశంలో నర్రా శ్రీనివాస్, జి.వెంకట్రావ్, వివికె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అజయ్‌కుమార్

నష్టపరిహారం కోసం ఐక్య ఉద్యమం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్

ప్రజాశక్తి -తాడికొండ

సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్యంగా అందరూ కలసి ఉద్యమించాలని రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం రాజధాని అమరావతి రైల్వే లైన్ కింద భూములు కోల్పోతున్న రైతులు ఆదివారం తాడికొండలోని సాయిబాబా గుడిలో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో భూములు కోల్పోతున్న రైతులందరూ పాల్గొని భవిష్యత్తు కార్యాచరణ చర్చించుకోవడం జరిగింది. దీనిలో భాగంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ తరతరాల నుంచి శ్రమజేసి, పెట్టుబడులు పెట్టి, రెండు నుంచి మూడు పంటలు పండే విధంగా భూములను సారవంతం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ భూములను ఒక్కసారిగా కోల్పోవడం అంటే కుటుంబం కోల్పోయినట్లే అని అన్నారు. రైతులకు భారీ మొత్తంలో నష్టపరిహారం అందించాలన్నారు. రాజధాని ప్రాంతంలో ఉన్న ఈ భూములకు నష్టపరిహారం చెల్లించిన విధంగా ఈ భూములు కూడా ఇవ్వవలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ ప్రాంతంలో రైల్వే జోన్ రావడం వలన అన్ని రకాలుగా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పాడి పరిశ్రమ కూడా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున నష్టపరిహారం చెల్లించాలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనియెడల ఉద్యమం బాటలో రైతులు పయనించడానికి సిద్ధమవ్వాలని పిలుపిచ్చారు. రైతుల నుండి భూములను బలవంతంగా తీసుకోవాలని ప్రయత్నిస్తే ప్రభుత్వానికి వ్యతిరేకంగా , ఉద్యమం చేస్తారన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు కంచర్ల శివరామయ్య, ఎడ్డూరి హనుమంతరావు, గోగినేని శ్రీనివాసరావు, ఎడ్లపల్లి సాంబశివరావు ,రామస్వామి రెడ్డి, చింతల భాస్కరరావు, కనగాల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు

ఉపాధి కల్పనకే జాబ్‌మేళాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్
గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. అందులో భాగంగానే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్‌మేళాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పట్టణంలోని విద్యాకేంద్రం కళాశాలలో ఆదివారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకుని నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. అనంతరం జాబ్‌మేళా ద్వారా ఎంపికైన 300 మందికి ఉద్యోగ నియామకపత్రాలను అందించారు.

ఉద్యోగాలకు ఎంపికైన యువత

అండర్ బ్రిడ్జి కింద నిలుస్తున్న నీరు

ప్రజాశక్తి -దాచేపల్లి
నడికూడి గ్రామం నుంచి గోగులపాడు గ్రామానికి వెళ్లే మార్గమధ్యంలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య వల్ల ఇటుగా ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు రైల్వే బ్రిడ్జి కింద చేరిన నీరును వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-పెదకూరపాడు
పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. ఆదివారం ఆయన కార్యాలయంలో ఎనిమిది మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.6,77,744ల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-నాదెండ్ల
మండలంలోని సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని, నూతన ల్యాబ్‌ను మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు ప్రారంభించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం సాతులూరు విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ.. సాతులూరు విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నరసరావుపేటకు కోటప్ప కొండ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా ఉంటే.. చిలకలూరిపేటకు కొండవీడు కోట చారిత్రక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, డాక్టర్ శరత్‌చంద్ర శివాజీ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. వైద్యశిబిరంలో 500 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

వర్తకుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- మాచర్ల
వ్యాపారస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి గుంటూరు, పల్నాడు జిల్లాల ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అభ్యర్థి ఏల్చూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మాచర్లలో పలువురు చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులను కలసి మద్దతు కోరారు. ఈ నెల 28న గుంటూరులో జరగనున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నేతలు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, సూరే ఎలమంద, చుండూరు వెంకటేశ్వర్లు, కొత్త శ్రీనివాసరావు, మేడంచిన్న వెంకటేశ్వర్లు, రంగా సత్యనారాయణ, గంగిశెట్టి రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్
స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చిలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను దొండపాటి సునందన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు దైవ సేవకులు రెవరెండ్ జయరావు అధ్యక్షత వహించగా.. రెవరెండ్ లాజరస్ భక్తులకు దైవ సందేశం అందించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు భక్తులు జీసస్‌కు సంబంధించిన పాటలను బాబు, కుమార్, వంకాయలపాటి ఆలపించారు. పలుకూరి జోసఫ్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

'వైసిపి హయాంలోనే దందాలు, సెటిల్‌మెంట్లు'

ప్రజాశక్తి - వినుకొండ
వైసిపి హయాంలో పోలీస్‌స్టేషన్లను సెటిల్మెంట్ కేంద్రాలుగా మార్చుకొని దందాలు చేసిన వ్యక్తులు.. కూటమి పార్టీల నేతలపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని కూటమి నాయకులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు యార్లగడ్డ లెనిన్‌కుమార్, నాగశ్రీను రాయల్, ఆయుబ్‌ఖాన్ మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వైసిపి నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. వైసిపి పాలనలో బొల్లా బ్రహ్మనాయుడు, వైసిపి నాయకులు దౌర్జన్యాలు, భూదందాలు ఎన్నో చేశారని ఆరోపించారు. తప్పుడు కేసులు పెట్టించారని అన్నారు. మార్కాపురం రోడ్‌లో రూ.కోట్లు విలువ చేసే భూములను సెటిల్మెంట్‌తో దోపిడీ చేశారని ఆరోపించారు. వెల్లటూరు రోడ్‌లో ప్రైవేటు భూమి ఆక్రమించడాన్ని ప్రశ్నించినందుకు ఒకరిని పోలీస్‌స్టేషన్లో పెట్టించారని గుర్తు చేశారు. మీడియా ప్రతినిధులు గొంతునూ నొక్కారని తెలిపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రెవెన్యూ రికార్డులు తారుమారు చేశారని విమర్శించారు. వీరి జాబితా అంతా తమ వద్ద ఉందని.. త్వరలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసిపి నాయకులు చేసిన హత్యాయత్నంపై సిబిఐ విచారణ జరగబోతుందన్నారు. వైసిపి పాలనలో వినుకొండ నియోజకవర్గంలో జరిగిన అవినీతి, అక్రమాలు, భూ దందాలన్నీ త్వరలోనే వెలుగులోకి వస్తాయని హెచ్చరించారు.

విలేకర్లతో మాట్లాడుతున్న కూటమి పార్టీల నాయకులు

సాగరమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్
ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ సర్వ మానవ పాపాలను తొలగించేందుకు దైవ కుమారుడైన ఏసుక్రీస్తు మానవ రూపాన్ని ధరించి, సమస్త జీవకోటి ఆచరించాల్సిన విధివిధానాలను వెలుగులోకి తెచ్చారని చెప్పారు. ఏసుక్రీస్తు సూచించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తేరు ప్రదక్షిణలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

పట్టణంలో ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి- మాచర్ల
వాహనదారులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మాచర్ల అర్బన్ ఎస్ఐ నరసింహా హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న, మద్యం సేవించిన యువకులను గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి, అపరాధ రుసుం విధించారు. త్రిబుల్ రైడింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వాహనదారులకు సూచించారు. వెంట డ్రైవింగ్ లైసెన్సు, వాహన పత్రాలు తప్పనిసరిగా తెచ్చుకోవాలని స్పష్టం చేశారు.

ఎల్లప్పుడూ అండగా ఉంటాను

ఆర్యవైశ్యుల సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే కన్నా

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్
ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక గోశాలలో ఆర్య వైశ్య సంఘాల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవకు ప్రతిరూపం ఆర్యవైశ్యులని ప్రశంసించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కొల్లిపర కాశీవిశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు ఆర్యవైశ్య అనుబంధ సంఘాల కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేపట్టారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులుగా అన్నం బాలసుబ్రహ్మణ్యం, చలివేంద్ర సంఘం అధ్యక్షులుగా బచ్చు వెంకటేశ్వర్లు, గోశాల సంఘం అధ్యక్షులుగా పెండ్యాల కాశీమల్లేశ్వరావు, యువజన సంఘం అధ్యక్షులుగా చల్లంచెర్ల కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అతుకూరి నాగేశ్వరావు, డి.నాగేశ్వరావు, సీహెచ్ శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా ఆర్యవైశ్యసంఘ అధ్యక్షులు ఎం.సాత్విక్ రామ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్, కొత్త రామకృష్ణ, పి.రామకోటేశ్వరావు, పెరుమాళ్ల శివశంకర్, దివ్వెల శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షులు కె.శంకర్, చలువాది హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా ప్రైవేట్ ఆస్పత్రులు

➢ రాజధాని గ్రామాల్లో పదుల సంఖ్యలో ఏర్పాటు

➢ సరైన వసతులు, వైద్యులు లేకపోయినా దండిగా ఫీజులు వసూలు

రాజధాని ప్రాంతం తుళ్లూరులో ఏరియా ఆసుపత్రి భవనం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో ప్రైవేట్ ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రధాన రహదారుల పక్కన.. భవనాలను రూ.వేలకు అద్దెకు తీసుకొని, ఆసుపత్రి పెట్టేస్తున్నారు. రాజధాని గ్రామాలైన తుళ్లూరు, రాయపూడి, మందడం, మల్కాపురం తదితర గ్రామాల్లో ఆసుపత్రులు పదుల సంఖ్యలో కనిపిస్తున్నాయి. రాజధాని నిర్మాణ పనులు మొదలైతే.. క్రమేపీ జనాభా పెరిగి, తమకు ఆదాయం బాగా వస్తుందన్న ఆలోచనతో కొంతమంది వైద్యులు ముందుగానే ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సరైన వసతులు, క్వాలిఫైడ్ వైద్యులు, సిబ్బంది లేకుండానే వీటిని ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారుతోంది. రాజధాని ప్రాంతం కావడం.. ప్రభుత్వ వైద్య సేవలు నానాటికీ తీసికట్టుగా మారడంతో 'ప్రైవేట్' వైద్యం రాజ్యమేలుతోంది.

తుళ్లూరులో 30 పడకల ఆరోగ్య కేంద్రం వెలసినా..

అమరావతి పరిధిలోని తుళ్లూరులో రూ.4 కోట్ల వ్యయంతో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మించినా వైద్యులు, సిబ్బంది నియామకం కాలేదు. పక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో అక్కడి వైద్యులు, సిబ్బంది 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం వద్దనే వైద్యం అందిస్తున్నారు. రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది లేకపోవడం.. పీహెచ్‌సీ వైద్యులు అరకొరగా వైద్యం అందిస్తుండటంతో రోగులు చేసేదిలేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన కొంతమంది తుళ్లూరు, మందడం, రాయపూడి తదితర గ్రామాల్లో యథేచ్ఛగా ఆసుపత్రులు పెట్టేస్తున్నారు. ఈ క్రమంలో ఎలాంటి నియమ నిబంధనలూ పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విశాలమైన భవనాలు, రోగులకు కనీస సౌకర్యాలు కూడా లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. బయటకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు.. రకరకాల వైద్య నిపుణుల పేర్లతో బోర్డులు వెలుస్తున్నాయి. లోపలికి వెళ్లి చూస్తే అందుకు విరుద్ధంగా ఒకరిద్దరు వైద్యులు తమకు అర్హత లేకున్నా, అన్ని జబ్బులకూ వైద్యం చేస్తున్నారు. రకరకాల వైద్య పరీక్షల పేరుతో కార్పొరేట్ స్థాయిలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చికిత్స కోసం దేనికి ఎంత చెల్లించాలన్న సూచిక బోర్డులు కూడా ఉండటం లేదు. గ్రామీణ నిరక్షరాస్యులైన పేద ప్రజలను ఫీజుల పేరుతో దోచుకుంటున్నారని, నిబంధనలు పాటించక పోయినా అడిగేవారే లేరని రోగులు వాపోతున్నారు. మెడికల్ షాప్, ల్యాబ్ సైతం వారే ఏర్పాటు చేసుకుని.. ఇష్టానుసారం దోచేస్తున్నారని చెబుతున్నారు. అవసరం లేకపోయినా వైద్య పరీక్షలు, మందులు రాయడం షరామామూలుగా మారిపోయిందని విమర్శిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ మంగళగిరి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మంగళగిరి

ఎస్‌ఎఫ్‌ఐ మంగళగిరి నూతన కమిటీ 22 మంది సభ్యులతో ఎన్నికైంది. ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా అహ్మద్ పఠాన్, సమీర్, ఉపాధ్యక్షులుగా జానీ, బాషా, ఆలీ, వెంకట సాయిచరణ్, నిర్మల్, సహాయ కార్యదర్శులుగా అబ్దుల్ గని, సుభానీ, మణికంఠ, అబ్దుల్ శన్మాజ్, సాయి బాలాజీ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే దిశగా ఈ కమిటీ పని చేస్తుందని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో ఒక్క ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు చెంగయ్య, జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి-చేబ్రోలు

విద్యార్థులు గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. నారకోడూరు పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణిత మేధావి రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. గణితంలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. 2024 సంవత్సరంలో ఒక్క రోజు కూడా సెలవు ఉపయోగించుకోకుండా, నిరంతరాయంగా పాఠశాలకు హాజరైన గణిత ఉపాధ్యాయులు కోలా ప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాసరావు, జె.విశ్వేశ్వరరావు, వై.రాజారెడ్డి, కె.ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పునర్వికాసం అవసరం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

సత్కారం పొందుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

భారత సమాజంలో సాంస్కృతిక పునర్జీవనం, పునర్వికాసం అవసరం ఎంతైనా ఉందని అరసం జాతీయ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో లక్ష్మీనారాయణ అభినందన సభ నిర్వహించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించిన సభలో లక్ష్మీనారాయణ ప్రసంగిస్తూ.. కులాలు, మతాలు, అసమానతలు, విద్వేషాలు లేని సమాజాన్ని సాధించుకున్న రోజున గురజాడ, శ్రీశ్రీ, గుర్రం జాషువా ల సాహిత్యం చదివే అవసరం ఉండదన్నారు. ప్రజలు పఠనా శక్తిని పెంచుకోవాలని, అద్భుతమైన తెలుగు సాహిత్యాన్ని నిరంతరం అధ్యయనం చేస్తూ సమాజ చైతన్యానికి తోడ్పడాలన్నారు. రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న సౌమ్యవాద, లౌకిక వాదాలకు తూట్లు పొడుస్తూ కాషాయికరణ జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సాహితీవేత్తలపై దాడులు చేస్తూ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారని వివరించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ.. పెనుగొండ లక్ష్మీనారాయణ దాదాపు 50 సంవత్సరాలుగా అందిస్తున్న సాహిత్యం సమాజ మలుపులో కీలక పాత్ర పోషించిందన్నారు. పెనుగొండతో ముచ్చట్లు, వారి మాండలీకంతో కూడిన చలోక్తులు అర్థవంతంగా ఉండి ఆలోచన రేకెత్తిస్తాయని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ పెనుగొండ లక్ష్మీనారాయణ కథా ప్రేమికుడని, నిర్మోహమాట విమర్శకులని అన్నారు. హిందూ కళాశాల తెలుగు శాఖాధిపతి ప్రొఫెసర్ యల్లాప్రగడ మల్లికార్జున రావు, మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, ప్రముఖ సాహితీ వేత్తలు డాక్టర్ వి.సింగారావు, డాక్టర్ సూర్యదేవర రవికుమార్, కాట్రగడ్డ దయానంద్, నిమ్మరాజు చలపతిరావు, టి.ధనుంజయరెడ్డి, గూడవల్లి నాగేశ్వరరావు, డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు తదితరులు ప్రసంగించారు. పెనుగొండ లక్ష్మీనారాయణకు శాలువా కప్పి, మెమెంటో అందించి ఘనంగా సత్కరించారు.

కళావేదిక ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలోని ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చి కాంపౌండ్‌లో నూతనంగా నిర్మాణమైన కళా వేదికను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు మాట్లాడుతూ కళావేదిక నిర్మాణం కోసం ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారం అందించినట్లు చెప్పారు. గ్రామంలో కుల మతాలకు అతీతంగా అందరికీ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ రిచర్డ్, తెలుగుదేశం మంగళగిరి నియోజకవర్గం పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, మండల అధ్యక్షురాలు బి.కృష్ణ వందన, వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, కాట్రగడ్డ గోపాలకృష్ణయ్య, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి మద్దినేని సుబ్రహ్మణ్యం, షేక్ నాగూర్ వలి, కత్తిక శ్రీరాములు, కాట్రగడ్డ లక్ష్మణరావు, బెజ్జం బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు తోపుడు బండి వితరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

దేవాలయాల ముందు చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న వృద్ధ దంపతులకు యంగ్ జనరేషన్ వెల్ఫేర్ సొసైటీ బాసటగా నిలచింది. సంస్థ సభ్యులు స్థానిక బోసురోడ్డులో శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం ఎదురుగా ఆదివారం నిర్వహించిన సమావేశంలో అచ్చయ్య, నాగమ్మ అనే వృద్ధ దంపతులకు తోపుడు బండిని ఉచితంగా అందజేశారు.

శ్రమయేవ జయతే పురస్కార ప్రదానోత్సవం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తాము ఎంచుకొన్న రంగంలో విద్య లేకుండా రాణించి, ఉన్నత స్థాయికి ఎదిగిన కార్మికులను గుర్తిస్తున్న తన్నీరు శివ శంకర్ అభినందనీయులని వ్యాపారవేత్త మర్రెడ్డి బసివిరెడ్డి, వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అప్పారావు అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో పసుపులేటి కోటేశ్వరరావు, తులసమ్మ స్మారక శ్రమయేవ జయతే పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మమ్మ, తాతయ్యల పేరుతో పురస్కారాలను అందించడం గొప్ప విషయమన్నారు. గుంటూరుకు చెందిన ఫ్రెండ్స్ ఇంజినీరింగ్ వర్క్స్ అధినేత షేక్ మొహిద్దీన్, సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు మట్టుపల్లి సాంబయ్యలకు పురస్కారాలను ప్రదానం చేశారు.

సెమీక్రిస్మస్‌లో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని 'కాసా' జాతీయ సేవాసంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జాలది ఏసుపాదం అన్నారు. శనివారం రాత్రి మండలంలోని వెలగపూడిలో ఇ-జెయింట్స్ టెక్నాలజీస్- ఎల్‌ఎల్‌సీ సహకారంతో స్ఫూర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసు పాదం దైవసందేశాన్ని అందించారు. స్ఫూర్తి సేవా సంస్థ కార్యదర్శి టి.రవి మాట్లాడుతూ.. ప్రపంచ మానవాళికి శాంతి, కరుణ, ప్రేమను పంచిన మహనీయుడు యేసుక్రీస్తు అని అన్నారు.క్రిస్మస్ వేడుకలకు ఇ - జెయింట్స్ టెక్నాలజీస్ - ఎల్ ఎల్ సి సీఈఓ బొద్దులూరి కష్ణ చైతన్య సహకారం అందించారన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచారు. మల్కాపురం, వెలగపూడి, దొండపాడు గ్రామాలకు చెందిన వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పాస్టర్ టి.పేతురు, సుకన్య, మహిళా మండలి అధ్యక్షులు పిడుగు రాణి, దానమ్మ, వాణిశ్రీ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

కొరిటపాడు ఆర్‌సీఎం స్కూల్లో సెమీక్రిస్మస్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక కొరిటపాడు లైబ్రరీ సెంటర్‌లోని ఆర్‌సీఎం స్కూలో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రఘు ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ రఘురాం పాల్గొని ప్రసంగించారు. పాఠశాల హెచ్‌ఎం ఎద్దుల అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ తరపున విద్యార్థులందరికీ నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది అనురాధ, వెంకాయమ్మ, సామ్రాజ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

రాజధానిలో ఇంటర్నేషనల్ స్కూలు అభినందనీయం

ఎయిమి పాఠశాల వార్షికోత్సవంలో ప్రముఖ చదరంగ క్రీడాకారిణి కోనేరు హంపి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని ప్రాతూరు ఎయిమి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం రాత్రి స్కూల్ నాలుగవ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ప్రముఖ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి, కేం బ్రిడ్జి అసోసియేట్స్ ఫాతిమా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సందర్భంగా కోనేరు హంపి మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతంలో అత్యాధునిక సాంకేతిక విలువలతో ఇంటర్నేషనల్ స్కూల్ ఉండడం ఆనందించదగ్గ విషయమని అన్నారు. ప్రస్తుత తరుణంలో మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో అనేక మార్పులు వస్తున్నా యని అన్నారు. విద్యా ర్థులు చిన్నతనం నుండి ఉన్నత విద్యను అభ్యసించేందుకు సాధన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో స్కూల్ చిన్నారులు చేసిన నృత్యాలు, వివిధ రకాల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఎయిమి ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత దంటు బాలాజీ రెడ్డి, ఓంకార్, స్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కోనేరు హంపి

'చలపతి'లో జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు : గణిత శాస్త్ర పితా మహుడు, శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ గణితశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ రావి శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు రామానుజన్ జయంతిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. గణిత శాస్త్రానికి మానవ, సామాజిక అభివృద్ధిలో ఎంతో ప్రాధాన్యత ఉందని చెప్పారు. కళాశాల చైర్మన్ వై.వి.ఆంజనేయులు మాట్లాడుతూ గణితంలో ప్రతి సమస్యకూ పరిష్కారం లభిసుందని, విద్యార్థులను రకరకాలుగా ఆలోచింపచేసి, వారి ఆలోచన శక్తిని పెంపొందిస్తుందని చెప్పారు. సహజంగా గణితం అంటే విద్యార్థులు భయపడతారని, కానీ సాధన చేస్తే గణితం చాలా సులభం అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ వై.సుజిత్, డీన్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎ.రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రావి శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

బ్రెయిన్‌బి క్విజ్‌లో భాష్యం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు : భాష్యం విద్యార్థులు జాతీయ స్థాయిలో తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్నతంగా రాణించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకష్ణ అన్నారు. అమరావతి రీజనల్ బ్రెయిన్‌బి-2025 ఆధ్వర్యంలో శనివారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన బ్రెయిన్ బీ క్విజ్ పోటీల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థి కొమరి లోకేశ్వర్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికై మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా ఆదివారం మెయిన్ క్యాంపస్‌లో లోకేశ్వర్‌రెడ్డిని ప్రత్యేకంగా రామకష్ణ అభినందించారు. 2025 ఏప్రిల్‌లో బెంగుళూరులో జరిగే 16వ ఇండియన్ నేషనల్ బ్రెయిన్‌బీ చాంపియన్‌షిప్‌కు లోకేశ్వర్‌రెడ్డి ఎంపికై మన రాష్ట్రం తరపున పోటీల్లో పాల్గొనబోతున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

లోకేశ్వర్‌రెడ్డిని అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

కాకినాడలో జనవరి 5, 6, 7, 8 తేదీలలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయా లని ఫెడరేషన్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఎ.ఎన్. కుసుమకుమారి పిలుపునిచ్చారు. ఆది వారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలంయలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 5, 6 తేదీల్లో రెండ్రోజులపాటు ఓపెన్ సెషన్‌లు జరుగుతాయని తెలిపారు. ఓపెన్ సెషన్స్‌లో ఉపాధ్యాయులు అందరూ వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 7, 8 తేదీలలో ప్రతినిధుల సభ జరుగుతాయన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.వి.హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం - సవాళ్ళు అనే అంశంపై, భవిష్యత్ అవసరాలు - విద్యా విధానాలు మొదలైన అంశాలపైన లోతుగా చర్చించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పెద్దలు విద్యారంగ నిపుణులు, మేధావులు ఈచర్చలలో పాల్గొంటారని అన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, యం.కళాధర్ మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, వై.నాగమణి జిల్లా కోశాధికారి ఎండి.దౌలా, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, కె.సాంబశివరావు, జి.వెంకటేశ్వరరావు, టి.ఆంజనేయులు, ఎండి.షకీలా బేగం, కె.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎ.ఎన్.కుసుమకుమారి

పిఎసిఎస్‌లలో కొత్త సభ్యులకు అవకాశం

రూ.300 చెల్లించి రైతులు చేరవచ్చు

ప్రజాశక్తితో పల్నాడు డిసిఒ నాగశ్రీనివాసు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పిఎసిఎస్) స్థానిక రైతులంతా సభ్యులుగా చేరవచ్చునని పల్నాడు జిల్లా డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసరు ఉదయగిరి నాగ శ్రీనివాసు తెలిపారు. రూ.300 షేర్ ధనంతో సభ్యులుగా చేరు వారు స్థానికంగా పాస్‌బుక్, ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఒక వేళ భూమి ఒక చోట ఉండి, నివాసం మరొక చోట ఉంటే భూమి ఉన్న ప్రాంతంలోని సొసైటీ అధికారి నుంచి తమ సొసైటీలో సభ్యత్వం లేదని ధృవీకరణ పొంది నివశిస్తున్న ప్రాంతంలోని సొసైటీలో సభ్యత్వం తీసుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

డిసిఒ అధికారి నాగశ్రీనివాసు

సొసైటీలలో షేర్ ధనం పెంచుతారా?

ప్రస్తుతం పెంపునకు సంబంధించి ఎటు వంటి ఉత్తర్వులు లేవు. కేవలం రూ.300 చెల్లించి రైతులంతా సభ్యులుగా చేరవచ్చు. పొలం ఉన్న ప్రాంతంలో కన్నా ఆధార్ కార్డులో చిరునామా ఎక్కడ ఉంటే అక్కడి సొసైటీలోనే చేరాలి. ఈ మేరకు ఉన్నతాధికారులు స్పష్టత ఇచ్చారు.

పిఎసిఎస్‌లలో ప్రస్తుతం అందుతున్న సేవలు?

సహకార సంఘాలతో రైతు సేవా కేంద్రాలను అనుసంధానం చేసి వాటి ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించే ప్రక్రియ కొనసాగుతోంది. వ్యవసాయ, ఉద్యాన శాఖల సహకారంతో ఈ సేవలు కొనసాగిస్తున్నాం. సొసైటీల ద్వారా జన ఔషధీ మందుల దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నాం. తొలుత నాదెండ్లలో ప్రారంభిం చారు. ఈ ఏడాది ఐదు సొసైటీల్లో ఏర్పాటు చేయనున్నాం. అలాగే పెట్రోలు బంకులు కూడా నడుపుతున్నాం. అంగలూరు, దూళిపాళ్ల, ఈపూరు,నరుకుళ్లపాడులో వీటిని ఏర్పాటు చేశాం. కోల్డ్ స్టోరేజీల నిర్మాణం కూడా చేపట్టారు. ధూళిపాళ్ల, శావల్యాపురం, నరుకుళ్ల పాడు, ఈపూరులో వీటిని ఏర్పాటుకు అనుమతి ంచారు. దూళిపాళ్ల స్టోరేజీ గుంటూరులో ఉంది. మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి. కారుమంచిలో ధాన్యం నిల్వకు కూడా ఒక స్టోరేజి ఏర్పాటు చేస్తున్నాం.

రుణాల మంజూరులో అక్రమాల నిరోధానికి తీసుకుంటున్న చర్యలు?

సొసైటీ పరిధిలో రుణ పొందే రైతులకు సంబంధించి ముందుగానే ఈకేవైసి చేయాల్సి ఉంటుంది. ఈక్రాప్, ఈకేవైసి, ఆధార్ సీడింగ్, పట్టాదారు పాసు పుస్తకాలు, ఇతర అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే రుణాలు పొందేలా పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.

సహకార సంఘాల్లో పర్సన్ ఇన్‌ఛార్జిల నియామకం పూర్తయిందా?

ప్రస్తుతానికి స్థానిక అధికారులతోనే పర్సన్ ఇన్‌ఛార్జిల నియమాకం చేశాం. గతంలో మాదిరిగా ముగ్గురు సభ్యులతో కమిటీలు ఇప్పుడు లేవు. అన్ని సహకార సంఘాల స్థాయిలో ప్రత్యేక అధికారులు పర్సన్ ఇన్‌ఛార్జిలను ఏర్పాటు చేశారు. ఆరు నెలల కాలపరిమితితో వీరిని నియమించాం. ఎన్నికలు జరిగే వరకు వీరు కొనసాగుతారు.

సొసైటీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు?

జిల్లాలో 50 సొసైటీల్లో గిడ్డంగులను నిర్మించాలని ప్రతిపాదన చేశాం. 40 గిడ్డం గులకు ఆమోదం లభించింది. వీటి నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ఆయా సొసైటీల్లో గిడ్డంగులకు అప్రోచ్, అనుసంధాన రోడ్ల నిర్మాణం జరుగుతోంది. నాబార్డు, డ్వామా ఆధ్వర్యంలో ఈ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

నమో అదానీ-కరెంట్ కహాని పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ రంగంలో అవినీతిపై నమో అదానీ- కరెంట్ కహాని అనే పుస్తకాన్ని ఆదివారం సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరి ంచారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడుతూ అదానీ కంపెనీ ఎపి ప్రభుత్వంతో కుదుర్చుకున్న సౌర విద్యుత్ ఒప్పందంలో రూ.1750 కోట్ల లంచంగా ప్రభుత్వ పెద్దలకు ముట్టిందని అమెరికా కోర్టులో నమోదైన కేసు ద్వారా వెల్లడైందన్నారు. ఈ కుంభకోణంపై తక్షణమే విచారణ చేపట్టాలని, అదానితో చేసుకున్న అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. రాష్ట్రాలు, దేశాలను దాటి భారీస్థాయిలో జరిగిన ఈ వ్యవహారం కేవలం అవినీతికి సంబంధించిన అంశమే కాదని, దీని ఫలితంగా ప్రజలు అనేక భారాలు మోయాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా మనరాష్ట్రంలో ప్రజల మీద పడుతున్న విద్యుత్ బిల్లుల భారం వంటివి అదానీ అవినీతి ప్రతిఫలమే అన్నారు. గత ప్రభుత్వం, నేడు కూటమి ప్రభుత్వం కూడా అదానీ సేవలో మునిగితేలుతున్నాయని విమర్శించారు.అవినీతికి సంబంధించి హిండెన్ బర్గ్ నివేదిక ప్రజలపై పడే భారాలను వెల్లడించినా పాలకులు స్పందించకపోవడం సరికాదన్నారు. అదానీ కుంభకోణంపై దర్యాప్తు జరిపి విద్యుత్ సంస్థను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్.నాగబ్రహ్మాచారి, దాసరి వెంకటేశ్వరరావు, సుబ్బారెడ్డి, ఆచారి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, ఇతర నాయకులు

ఆదర్శనీయం.. నూతలపాటి కాళిదాసు జీవితం

అభినందన సంచిక ఆవిష్కరణ సభలో నల్లూరి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

సామాజిక బాధ్యతను వృత్తిగా చేసుకొని, కమ్యూనిస్టు విలువలతో కొనసాగుతున్న నూతలపాటి కాళిదాసు జీవితం ఆదర్శమని నల్లూరి వెంకటేశర్లు అన్నారు. ఆదివారం స్థానిక ఎపిఎన్‌జిఒ హోమ్‌లో కాళిదాసు అభినందన సంచిక ఆవిష్కరణ సభ జరిగింది. సంస్కృతి వ్యవస్థాపకులు సర్రాజు బాలచందర్ అధ్యక్షతన జరిగిన సభలో కాళిదాసు అభినందన సంచికను నల్లూరి వెంకటేశ్వర్లు ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లా డుతూ కాళిదాసు జీవితం ఆదర్శమని, అనుసరణనీయమని అన్నారు. ప్రతి ఒక్కరికీ కుటుంబం, వృత్తి, సామాజిక బాధ్యతలు ఉండాలన్నారు. కానీ కాళిదాసు కుటుంబం, వృతి కంటే సామాజిక బాధ్యతనే మిన్నగా భావించాడన్నారు. సామాజిక బాధ్యతను వృత్తిగా మార్చుకొని సమాజ మార్పు కోసం పనిచేశాడన్నారు. కళ కళకోసం కాదు, ప్రజల కోసం అని నినదించిన ప్రజానాట్యమండలిలో సుదీర్ఘకాలం పనిచేసి ప్రజా చైతన్యానికి కృషి చేశాడని కొనియాడారు. ప్రజాకవి కొత్తూరు దేవేంద్ర మాట్లాడుతూ కాళిదాసు వ్యక్తిగత జీవితం కంటే ప్రజానాట్యమండలితో కలిసి నడిచిన జీవితమే ఎక్కువగా ఉంటుందన్నారు. అక్షరాస్యత, సారా వ్యతిరేక ఉద్యమం, సైన్స్ ఉద్యమంలో గుంటూరు జిల్లాలో చురుకైన పాత్ర పోషించి, ప్రజల్లో చైతన్యానికి కృషి చేశాడన్నారు. ఆయనది విశిష్టమైన వ్యక్తిత్వం అని, పదిమందికోసం బ్రతకాలి అని నిరంతరం తపన పడ్డాడన్నారు. కమ్యూనిస్టు ప్రమాణాలు పాటించటంలో విశిష్టమైన నిబద్ధత చూపాడన్నారు. ప్రజానాట్యమండలి పూర్వ కార్యదర్శి కె.శాంతారావు మాట్లాడుతూ కళ కళ కోసం కాదని, ప్రజల కోసం అని ప్రజా సాంస్కృతిక ఉద్యమం చాటిందని, ఆ కృషిలో కాళిదాసు ముందుభాగాన ఉన్నాడని కొనియాడారు. కార్యక్రమంలో రంగస్థల, సినీ నటులు ముత్తరపు సురేష్‌బాబు, ప్రజాగాయకుడు పి.వి.రమణ తదితరులు ప్రసంగించారు. అనంతరం కాళిదాసును, విజయలక్ష్మి దంపతుల్ని అతిథులు, బంధు మిత్రులు సత్కరించారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు, దేవేంద్ర, శాంతారావు, బాలచందర్, పివి రమణ తదితరులు